డంపింగ్ కేంద్రాలుగా ఖాళీ స్థలాలు

- మురుగు నీటి తటాకాలుగా మారుతున్న వైనం
- విజృంభిస్తున్న దోమలు
- పట్టించుకోని వీఎంసీ అధికారులు

వించిపేట(విజయవాడపశ్చిమ): స్థానిక 55వ డివిజన్, కంసాలిపేటలో ఉన్న ఖాళీ స్థలాలు మురుగు నీటి తటాకాలుగా మారడమే కాకుండా చెత్త డంపింగ్ కేంద్రాలుగా దర్శనమిస్తున్నాయి. ఖాళీగా ఉన్న స్థలాల్లో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కల కారణంగా దోమలు విపరీతంగా పెరిగి స్థానికులకు నిద్రపట్టకుండా చేస్తున్నాయి. ఇక్కడ పదుల సంఖ్యలో ఉన్న ఖాళీ స్థలాలు చెత్త చెదారంతో నిండి దోమలకు ఆవాస కేంద్రాలుగా మారాయి. పగలంతా కూలి పనులు చేసుకుని ఇళ్లకు చేరితే రాత్రుళ్లు విజృంభిస్తున్న దోమలతో కంటిమీద కునుకు లేకుండా పోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తరచూ ఆరోగ్య సమస్యలు

ఖాళీ స్థలాల్లో పెరిగిన మొక్కలతో పాటు ఇళ్లలోని వ్యర్థాలను ఖాళీగా ఉన్న స్థలాల్లోని ప్లాట్లలో పడేయడంతో అక్కడ తీవ్ర పారిశుద్ధ్య సమస్య తలెత్తుతోంది. దీంతో కుళ్లిపోయిన వ్యర్థాల కారణంగా దుర్గంధం వెదజల్లి ఇళ్లలో ఉండలేని పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. వీటి కారణంగా పిల్లలు, వృద్ధులు తరచూ అనారోగ్య పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విష పురుగుల సంచారం

కంసాలిపేటలోని పలు నివాసాల మధ్య ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన వ్యర్థాలతో పాటు పిచ్చి మొక్కలు గుబురుగా పెరిగిపోవడంతో దోమలు, విష పురుగులు చేరి తమకు నిద్రలేకుండా చేస్తున్నాయని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. చెట్ల మధ్య చేరిన విష పురుగుల కారణంగా తమ పిల్లలకు ఎప్పుడేం జరుగుతుందోనని భయపడాల్సిన పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. ఒక పక్క స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్ర, డ్రైడే – ఫ్రైడే అంటూ ఊదరకొడుతున్న వీఎంసీ అధికారులు ఇక్కడ నెలకున్న పరిస్థితులను పట్టించుకోకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఖాళీ స్థలాల్లో నెలల తరబడి నిలుస్తున్న చెత్త, మురుగు నీరుతో పేరుకుపోతున్నా నగరపాలకసంస్థ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన శానిటరీ, మలేరియా సిబ్బంది ఈ ప్రాంతంపై దృష్టిపెట్టి ఇక్కడ నెలకున్న సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



కంసాలిపేటలోని మెయిన్‌రోడ్డులో గల ఖాళీ స్థలంలో పెరిగిన పిచ్చి మొక్కలు



మున్సిపల్ స్కూల్ రోడ్డు మలుపులో పిచ్చి మొక్కలతో నిండిన ఖాళీ ప్లాట్

చర్యలు తీసుకుంటాం

కంసాలిపేటలో ఉన్న ఖాళీ స్థలాల్లో చెట్లు పెరిగిపోవడంతో తరచూ సిబ్బందిచేత శుభ్రం చేయిస్తున్నాం. అదేవిధంగా సంబంధిత ప్లాట్స్ యజమానుల దృష్టికి తీసుకువెళ్లి ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు, పిచ్చి మొక్కలు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. ఎక్కడైతే సమస్య ఎక్కువగా ఉందో అక్కడ గ్యాంగ్ వర్కుతో శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటాం.

– ఆయూబ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

- బీసీల హక్కుల సాధనకై ఈనెల 20న చలో ఢిల్లీ
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లగుడు గోవిందరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అన్ని రంగాల్లో వెనుకబడిన బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు డాక్టర్ లగుడు గోవిందరావు డిమాండ్ చేశారు. బీసీ హక్కుల సాధనకై ఈ నెల 20న ఛలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజయవాడ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఛలో ఢిల్లీ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీ సామాజిక వర్గాలకు దశాబ్దాలుగా అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీలకు జనాభా దామాషా ప్రకారం ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో ప్రాధాన్యం కల్పించాలని కోరారు. ఈ నెల 21వ తేదీ నుంచి జరగనున్న పార్లమెంట్ సమావేశాల్లో రిజర్వేషన్లు కల్పిస్తూ నిర్ణయం తీసుకోవాలన్నారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, బీసీలపై జరుగుతున్న దాడుల నుంచి రక్షణకు బీసీ రక్షణ చట్టం తేవాలని డిమాండ్ చేశారు. బీపీ మండల్ కమీషన్ సిఫార్సులు పూర్తి స్థాయిలో అమలు చేయాలని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. బీసీ రైతులకు 100 శాతం సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయాలని, కేంద్ర బీసీ కమిషనులో ఖాళీగా ఉన్న సభ్యులను నియమించాలని తెలిపారు. ఈ డిమాండ్ల సాధనకు ఈనెల 20న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



చలో ఢిల్లీ కార్యక్రమం వాల్ పోస్టర్ ఆవిష్కరణ

యాసిడ్ గోడౌన్‌కు సీలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ విద్యాధరపురం సితార జంక్షన్ సమీపంలోని లక్ష్మీనగర్‌లోగల యాసిడ్ గోడౌన్‌కు నగరపాలక సంస్థ సిబ్బంది శుక్రవారం సీలు వేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా నివాస ప్రాంతాల్లో ప్రమాదకరమైన యాసిడ్ గోడౌన్‌ను నిర్వహించటంపై చుట్టుపక్కలవారు అభ్యంతరం తెలియజేస్తూ కలెక్టర్‌కు గత ఫిబ్రవరి నెలలో గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. అక్కడ నుంచి మున్సిపల్ కమిషనర్ దగ్గరకు వచ్చిన తరువాత గోడౌన్ యజమానికి నోటీస్ ఇచ్చారు. దాంతో అతను 90 రోజుల్లో గోడౌన్‌ను ఖాళీ చేస్తానని లిఖితపూర్వకంగా రాసి ఇచ్చారు. గడువు ముగిసిన తరువాత కూడా గోడౌన్‌ను ఖాళీ చేయకపోవడంతో మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్రకు నోట్ ఫైల్ పెట్టారు. దాంతో ఆయన ఆదేశాల మేరకు సిబ్బంది పోలీస్ ప్రొటెక్షన్ మధ్య గోడౌన్‌కు సీలు వేశారు. కార్యక్రమంలో సర్కిల్–1 హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, శానిటరీ సూపర్‌వైజర్ సోమరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎ.వెంకటేశ్వరరావు, మేస్త్రి కొండా రామిరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.



యాసిడ్ గోడౌన్‌కు సీలు వేస్తున్న వీఎంసీ సిబ్బంది

సచివాలయ ఉద్యోగుల బదిలీ విధానం గందరగోళం

ఏపీ గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ అధ్యక్షుడు అర్లయ్య

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రభుత్వానికి చెందిన వివిధ విభాగాల్లో జరుగుతున్న బదిలీలకు లేని నియమ నిబంధనలు గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలకు మాత్రమే ఎలా వర్తిస్తాయని ఏపీ గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల అర్లయ్య శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో పారదర్శకత లోపించిందని, దాంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. లక్షా ముప్పైవేల మంది సచివాలయ ఉద్యోగులకు ఉపాధ్యాయుల తరహాలోనే పారదర్శకమైన వెబ్ కౌన్సెలింగ్ విధానం ద్వారా బదిలీలు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. సిఫార్స్ లేఖలకే పెద్ద పీట వేస్తుండటంతో ప్రాధాన్యతా వర్గాల ఉద్యోగులు, దివ్యాంగులు, భాగస్వామ్య మెరిట్ ఉద్యోగులకు బదిలీల్లో ప్రాముఖ్యత దక్కడం లేదన్నారు. పలు జిల్లాల్లోని కొన్ని శాఖలలో చనిపోయిన, రాజీనామా చేసిన ఉద్యోగులకు కూడా బదిలీలు జరగడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ నెల 5వ తేదీతో ముగియాల్సిన బదిలీల ప్రక్రియ కొన్ని శాఖల్లో ఇప్పటికీ బదిలీల జాబితాలు విడుదల చేయకపోవడం దేనికి సంకేతమో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

• అంబులెన్స్‌కూ తప్పని ట్రాఫిక్ కష్టాలు



విజయవాడ వన్‌టౌన్ మున్సిపల్ కార్యాలయం సమీప రోడ్డులో వీవీఐపీ, వీఐపీ, ప్రొటోకాల్ కార్ల రాకపోకల మధ్య ట్రాఫిక్‌లో చిక్కుకున్న అంబులెన్స్, ఇతర వాహనాలు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

దుర్గగుడిలో అంతర్గత బదిలీలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో పాటు ఎస్ఎంఆర్, అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని అంతర్గత బదిలీలు చేస్తూ ఈవో శీనానాయక్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. బదిలీలలో ప్రధాన ఆలయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని, దర్శన టికెట్లు, ప్రసాదాల విక్రయ కౌంటర్లు, ఆర్జిత సేవా టికెట్ల కౌంటర్లు, స్కానింగ్ పాయింట్‌తో పాటు మల్లేశ్వర స్వామి వారి ఆలయం, ఉపాలయాల వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి సైతం బదిలీలు అయ్యాయి.

వీఎంసీ స్థాయీ సంఘం ఎన్నిక ఏకగ్రీవం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ స్థాయీ సంఘం సభ్యుల ఎన్నిక ఏకగ్రీవమయింది. మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధ్యక్షురాలిగా ఉండే ఈ సంఘానికి ఆరుగురు సభ్యుల ఎన్నికకు ఇటీవలే వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర నోటిఫికేషన్ విడుదల చేశారు. వైఎస్సార్ సీపీ నుంచి 62వ డివిజన్ కార్పొరేటర్ అల్లంపూర్ విజయలక్ష్మి, ఒకటో డివిజన్ కార్పొరేటర్ ఉద్దంటి సునీత, 21వ డివిజన్ కార్పొరేటర్ పుప్పాల కుమారి, 19వ డివిజన్ కార్పొరేటర్ రెహానా నాహిద్, 55వ డివిజన్ కార్పొరేటర్ శీరంశెట్టి పూర్ణ చంద్రరావు, 38వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా నామినేషన్ దాఖలు చేశారు. వీరిపై ఎవరూ పోటీ చేయకపోవడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. సభ్యులకు వీఎంసీ అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్, జనరల్) డాక్టర్ డి. చంద్రశేఖర్ డిక్లరేషన్ పత్రాలు అందించారు.

సదరమ్ సర్టిఫికెట్ల పరిశీలన గ్రౌండ్‌ఫ్లోర్‌లో జరపాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): సదరమ్ సర్టిఫికెట్‌ల పరిశీలనను ప్రభుత్వాస్పత్రిలోని రెండో అంతస్తులో నిర్వహిస్తుండటంతో అక్కడకు వెళ్లేందుకు వికలాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షులు డాక్టర్ అంబటి రాధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి సైతం తీసుకెళ్లినట్లు చెప్పారు. వికలాంగుల పట్ల మానవత్వంతో ఆలోచించి సర్టిఫికెట్ల పరిశీలనను గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఏర్పాటు చేయాలని కోరారు. రెండో అంతస్తులోకి వెళ్లేందుకు లిఫ్ట్ కూడా పనిచేయక, ర్యాంప్‌పై తీవ్ర ఇబ్బందులు పడుతూ వెళ్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయమై ఆస్పత్రి అధికారులు స్పందించాలని కోరారు.

టీటీడీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ

విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీవారి అన్నప్రసాదం భక్తులకు చేరువ చేసే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపంలో దాతలు కంభంపాటి అవినాష్, లక్ష్మీప్రత్యూష సహకారంతో 300 మంది భక్తులకు అన్నప్రసాదం అందించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లలితా రమాదేవి కంభంపాటి విజయలక్ష్మి, రవితేజ పాల్గొన్నారు. ముందుగా కల్యాణ మండపంలో కొలువైవున్న పద్మావతి శ్రీనివాసులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

శాస్త్రీయ సంగీత వైభవాన్ని చాటిన కచేరి

విజయవాడ కల్చరల్: సామగాన లహరి కల్చరల్ ట్రస్ట్, కంచి కామకోటి పీఠస్థ శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానం సౌజన్యంతో సంగీత వాగ్గేయకారుడు మల్లాది సూరిబాబు 80 జన్మదిన వేడుకల సందర్భంగా లబ్బీపేట శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న శాస్త్రీయ సంగీత కచేరీలు సంగీత వైభవాన్ని చాటుతున్నాయి. శుక్రవారం నాటి కార్యక్రమంలో చెన్నైకి చెందిన యువ సంగీత కళాకారుడు ధూళిపాళ్ల సాయి దీక్షిత్ రెండు గంటల పాటు వాగ్గేయకార కీర్తనలను అలవోకగా ఆలపించారు. శివనంద యశశ్వి మృదంగంపై శ్రీరంజనీ వైష్ణవీ వాద్య సహకారం అందించారు. నిర్వాహకుడు మల్లాది సూరిబాబు మాట్లాడుతూ శనివారం నాటి కార్యక్రమాలు ఉదయం 10 గంటలకు ప్రారంభమై రాత్రి 10 గంటల వరకు సాగుతాయని తెలిపారు. దేవాలయ కార్యనిర్వాహకుడు డాక్టర్ రామ్మోహనరావు పాల్గొన్నారు.



కీర్తనలు ఆలపిస్తున్న సాయి దీక్షిత్

రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ విస్తృత తనిఖీలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ దేవి గంజిమాల శుక్రవారం విజయవాడలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. విద్యాధరపురం చెరువు సెంటర్, చిట్టినగర్, ఫ్రైజర్ పేటల్లోని రేషన్ షాపులు, రామరాజ్యనగర్, ఫ్రైజర్ పేట, గొల్లపూడిల్లోని ఐదు అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి తనిఖీ చేశారు. చిట్టినగర్ కలరా హాస్పిటల్ వద్ద ఉన్న అర్బన్ ప్రైమరీ ఆరోగ్య కేంద్రం, గొల్లపూడిలోని శ్రీపోసాని నరసింహారావు చౌదరి హైస్కూల్, జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన సౌకర్యాలను పరిశీలించారు. గొల్లపూడి గ్రామ పరిధిలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్‌లో స్టాక్‌ను తనిఖీ చేశారు. రేషన్ షాపుల్లో స్టాక్, ఎన్ని కార్డులు ఉన్నాయి, ఎంత మందికి పంపిణీ చేశారు, లైసెన్స్‌లు తనిఖీ చేశారు. వృద్ధులు, దివ్యాంగుల ఇళ్లకు తీసుకువెళ్లి రేషన్ అందిస్తున్నదీ లేనిదీ డీలర్లను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణీ, బాలింతలకు సరఫరా చేసే పౌష్టికాహారం, పాఠశాలల్లో విద్యార్థులకు పెట్టే మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా డీఎస్ఓ ఎ.పాపారావు, సర్కిల్–1,2,3 ఏఎస్ఓలు సి.లక్ష్మీనారాయణ, వి.శ్రీనివాసులు, ఎస్.లక్ష్మణ్ బాబు, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ కుమారి, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ రమేష్‌బాబు, వెల్ఫేర్ హాస్టల్స్ డిపార్ట్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.



గొల్లపూడి ఎంఎల్ఎస్ పాయింట్‌లో బియ్యం స్టాక్ తనిఖీ చేస్తున్న దేవి

అభివృద్ధి పనులపై కాంట్రాక్టర్లతో ఈవో సమీక్ష

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై శుక్రవారం ఈవో శీనానాయక్ కాంట్రాక్టర్లు, దాతలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మహా మండపం నాల్గో అంతస్తులోని ఈవో చాంబర్‌లో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆలయంలో జరుగుతున్న కీలక అభివృద్ధి పనుల గురించి చర్చించారు. ముఖ్యంగా మాస్టర్ ప్లాన్‌లో భాగంగా జరుగుతున్న అన్నదానం, ప్రసాదాల పోటు భవనాలను దసరా నాటికి సిద్ధం చేయాలని ఈవో సూచించారు. అదే విధంగా కనకదుర్గనగర్ నుంచి నిర్మిస్తున్న ఎలివేటెడ్ క్యూ కాంప్లెక్స్, హిల్ ప్రొటెక్షన్ పనులు, పూజా మండపం, నూతన యాగశాల పనుల గురించి చర్చించారు. భక్తుల సౌకర్యార్థం, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా జరుగుతున్న పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. జరుగుతున్న పనులపై తరచూ పరిశీలన ఉంటుందని, రివ్యూ సమావేశాల్లో పనుల పురోగతి గురించి వివరించాల్సి ఉంటుందని ఆలయ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం కాంట్రాక్టర్లు, దాతలతో కలిసి అభివృద్ధి పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. సమీక్ష సమావేశంలో దేవస్థాన ఈఈ కోటేశ్వరరావు, దాత సంగా నరసింహారావు, కాంట్రాక్టర్లు, ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కాంట్రాక్టర్లు, దాతలతో మాట్లాడుతున్న ఈవో శీనానాయక్

ఉర్దూకు పర్మినెంట్ లెక్చరర్స్‌ను నియమించాలని వినతి

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్న ఉర్దూ విభాగానికి పర్మినెంట్ లెక్చరర్స్‌ను నియమించాలని భవానీపురానికి చెందిన మాజీ కార్పొరేటర్ మొహమ్మద్ అబ్దుల్ ఖాదర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మంగళగిరిలోని ఉన్నత విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ నారాయణ భరత్ గుప్తాను కలిసి వినతి పత్రం అందజేశారు. కోస్తా జిల్లాల్లో ఉర్దూ డిగ్రీ సెక్షన్ ఉన్న ఏకైక కళాశాల ఇదొక్కటేనని, ప్రస్తుతం ఇక్కడ గెస్ట్ లెక్చరర్స్‌తో కాలం గడిపేస్తున్నారని, అలా కాకుండా పర్మినెంట్ లెక్చరర్స్‌ను నియమిస్తే విద్యార్థులకు మంచి బోధన జరుగుతుందని వినతి పత్రంలో పేర్కొన్నారు. సమస్యను త్వరలో పరిష్కరిస్తానని కమిషనర్ హామీ ఇచ్చినట్లు ఖాదర్ తెలిపారు. కార్యక్రమంలో అబ్దుల్ సలీం, అహ్మద్ ఖాన్, సయ్యద్ సంధాని, మన్సూర్ బేగ్ పాల్గొన్నారు.



ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నారాయణ భరత్ గుప్తాకు వినతిపత్రం ఇస్తున్న ఖాదర్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం రామరాజ్యనగర్ సెక్షన్ 33/11 కేవీ కబేళా విద్యుత్ ఉప కేంద్రంలో 11 కేవీ విద్యాధరపురం ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతులతోపాటు మెయింటెనెన్స్ కారణంగా కొన్ని ప్రాంతాల్లో రెండున్నర గంటల సేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పీ రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8.30 గంటల నుంచి 11 గంటల వరకు బాలాజీనగర్, లక్ష్మీనగర్, మోడ్రన్ మ్యాక్స్ ఏరియా, లేబర్‌కాలనీ, నారిండివారి వీధి, కప్పగంతుల వారి వీధి, కొండ బడి ఏరియా, సొరంగం కొండ, చెరువు సెంటర్, మర్రి చెట్టు సెంటర్, చిన్న సాయిబాబా గుడి ఎదురు కొండ ప్రాంతం, పెద్ద సాయిబాబా గుడి కొండ ఏరియా తదితర ప్రాంతాల్లో పైన పేర్కొన్న సమయంలో కరెంట్ సరఫరా నిలిపి వేయనున్నట్లు వివరించారు. విద్యుత్ వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖతో సహకరించాలని కోరారు.

చిట్టినగర్ సెక్షన్‌లో..

చిట్టినగర్ సెక్షన్ మిల్క్ ప్రాజెక్ట్ సబ్ స్టేషన్ పరిధిలో గల 11 కేవీ కలరా హాస్పటల్ ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం కొన్ని ప్రాంతాల్లో రెండున్నర గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పీ రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8.30 గంటల నుంచి 11 గంటల వరకు సాయిరాం థియేటర్ ఎదురు కొండ ప్రాంతం, లంబాడీపేట, ఫైర్ స్టేషన్ ఎదురు కొండ ప్రాంతం, కలరా హాస్పటల్ కొండ, ఎస్వీ ఫంక్షన్ హాల్ వెనుక తదితర ప్రాంతాల్లో కరెంట్ నిలిపివేయనున్నట్లు ఆయన వివరించారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలన్నారు.

భవానీపురం పరిధిలో..

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం పరిధిలోని 11 కేవీ టీచర్స్‌కాలనీ ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతులలో భాగంగా కొన్ని ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పీ రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు టీచర్స్ కాలనీ, అప్నా బజార్ రోడ్, ఇందిరా ప్రియదర్శిని కాలనీ, దర్గా ప్లాట్స్, హౌసింగ్‌బోర్డ్ కాలనీలోగల 450 ఎస్ఎఫ్‌టీ బ్లాక్స్ ప్రాంతాల్లో పైన పేర్కొన్న సమయంలో కరెంట్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ముగిసిన గురుపౌర్ణిమ వేడుకలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక హౌసింగ్‌బోర్డ్ కాలనీలోని సంకల్ప సిద్ధి శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో మూడు రోజులపాటు నిర్వహించిన గురుపౌర్ణిమ పర్వదిన వేడుకలు నాలగవ రోజు శుక్రవారంతో ముగిశాయి. ఉదయం 7గంటలకు సాయిబాబాకు పుష్పాలతో సహస్ర నామార్చాన జరిగింది. అనంతరం 72 గంటలపాటు నిరంతరంగా సాగిన 'ఓం సాయి శ్రీసాయి జయజయ సాయి' అఖండ సాయినామ సంకీర్తన ముగింపుతో గురుపౌర్ణిమ వేడుకలు ముగిశాయని మందిరం పాలకవర్గం అధ్యక్షుడు బూర్లె వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ ఉత్సవాల నిర్వహణకు సహకరించిన పాలకవర్గ సభ్యులు, దాతలు, విశేషంగా పాల్గొన్న భక్తులకు ధన్యవాదాలు తెలియజేశారు. ముగింపు వేడుకల్లో పాలకవర్గం ఉపాధ్యక్షుడు మోటుమర్రి సుబ్బారావు, ఇన్నమూరి వెంకట రమేష్, కోశాధికారి చందలూరి రాజశేఖర్, సంయుక్త కార్యదర్శి పెండేల వెంకట లక్ష్మీప్రసాద్, సహాయ కార్యదర్శి గుడివాడ విజయ్‌కుమార్, సభ్యులు పాల్గొన్నారు.



అలంకారంలో సాయిబాబా

క్లుప్తంగా

జాగ్రత్తలు తీసుకుంటే టీబీని అరికట్టొచ్చు



పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): టీబీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకుని, తగిన జాగ్రత్తలు తీసుకుంటే టీబీ వ్యాధిని అరికట్టవచ్చని పాత ఆర్ఆర్‌పేటలోని యూపీహెచ్‌సీ డాక్టర్ మనోజ్ఞ పేర్కొన్నారు. ప్రధాన మంత్రి టీబీ ముక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం హాస్పటల్ ప్రాంగణంలోని టీబీ యూనిట్‌లో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీబీ నియంత్రణ చర్యల్లో భాగంగా తొలిసారిగా టీబీ ఇంజెక్షన్‌లను చేస్తున్నామన్నారు. టీబీ బాధిత కుటుంబ సభ్యులకు, మధుమేహం వ్యాధితో బాధపడుతున్న వారికి ఈ ఇంజెక్షన్ చేసి టీబీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. టీబీ యూనిట్ సిబ్బంది, ఆశ వర్కర్‌లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

సోనీ బ్రావియా నూతన మోడల్స్ ఆవిష్కరణ




గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జపనీస్ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం సోనీ కంపెనీ 2025 నూతన మోడల్స్ మార్కెట్‌లోకి అందుబాటులోకి వచ్చాయి. విజయవాడ ఏలూరు రోడ్డు విజయటాకీస్ సెంటర్‌లోని సోనోవిజన్ షోరూంలో మేనేజింగ్ పార్టనర్ భాస్కరమూర్తి సోనీ ఇండియా ఏపీ స్టేట్ హెడ్ అయ్యప్పన్‌తో కలిసి శుక్రవారం నూతన మోడల్స్‌ను ఆవిష్కరించారు. వీటిలో బ్రావియా 5 టీవీ, బ్రావియా సిస్టమ్ 6 హోమ్ థియేటర్, బ్రావియా బార్ 6 సౌండ్‌బార్ మోడల్స్ ఉన్నాయి. కార్యక్రమంలో డెప్యూటీ మేనేజర్ భాస్కర్, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు పాటుపడాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ సీపీలో నూతనంగా వివిధ పదవులు పొందిన నేతలు పార్టీ పటిష్టతకు పాటుపడాలని ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు సూచించారు. నూతనంగా పదవులు పొందిన పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ సలీం, రాష్ట్ర ప్రచార విభాగం కార్యదర్శి చగలమర్రి ప్రేమ్ కుమార్‌లు వెలంపల్లి శ్రీనివాసరావును ఆయన కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యవంతం చేయాలని సూచించారు. అనంతరం వెలంపల్లి శ్రీనివాసరావు నాయకులను సత్కరించారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

జ్ఞాన జ్యోతిని వెలిగించేవాడే గురువు



విజయవాడ కల్చరల్: గురు సంప్రదాయాన్ని కాపాడుకోవాలని సంస్కార భారతి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పీవీఎస్ కృష్ణ అన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా సంస్కార భారతి మహానగర్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై సాంస్కృతిక కళా ప్రదర్శనలు, వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన వారికి గురు సత్కారం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమాలను ప్రారంభించిన పీవీఎస్ కృష్ణ మాట్లాడుతూ సంస్కార భారతి సాంస్కృతిక, కళా, సాహిత్య రంగాలకు విశేషమైన సేవలను అందిస్తుందని చెప్పారు. సంస్కార భారతి నగర అధ్యక్షుడు పసుమర్తి భాస్కరశర్మ మాట్లాడుతూ జ్ఞాన జ్యోతిని వెలిగించేవాడు గురువన్నారు. విశ్వహిందూ పరిషత్ కోశాధ్యక్షుడు వి.దుర్గాప్రసాద్, విద్యావేత్త బోని సురేష్, వేదచారిటబుల్ సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ యడ్లపాటి శేషసాయి, హైకోర్ట్ న్యాయవాది వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. సాయిశంకర్, శ్రావణ్‌కుమార్ నిర్వహించారు. సంస్కారభారతి నగర బాధ్యులు పాల్గొన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా చిట్టా వెంకట ప్రసాద్(నాటక రంగం), గండూరి శ్రీనివాస మూర్తి(సంగీతం), డాక్టర్ రామకృష్ణ(సాహిత్యం) డాక్టర్ చలికాండ ఉషామాధవి(నృత్యం), ఎస్.ప్రభాకర మల్లికార్జునరావు(చిత్రలేఖనం)ను సత్కరించారు. సంస్కార భారతి యువ కళాకారులు ప్రదర్శించిన అంశాలు ఆకట్టుకున్నాయి.